# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 02-07-2025 సమయం : సాయంకాలం 6 గం. 10 ని. లు

## ముఖ్యాంశాలు

- కుప్పం నియోజకవర్గానికి ఈ ఏడాదిలోనే హంద్రీనీవా నీటిని తీసుకుస్తామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు.
- కర్నూలు - విజయవాడ మధ్య ఇండిగో విమాన సేవలను కేంద్రమంత్రి కె. రామ్మోహన్ నాయుడు ప్రారంభించారు.
- మహిళల కోసం ఆగస్టు 15 నుండి ఉచిత బస్సు ప్రయాణం కార్యక్రమాన్ని అమలు చేస్తామని మంత్రి నిమ్మల రామానాయుడు వెల్లడించారు.
- డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం పని తీరుపై మంత్రి సత్యకుమార్ యాదవ్ ఈ రోజు సమీక్ష నిర్వహించారు.
- రాష్ట్రంలో రానున్న మూడు రోజుల పాటు తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు కురుస్తాయని వాతావరణ కేంద్రం తెలిపింది.

==========================

కుప్పం నియోజకవర్గానికి ఈ సంవత్సరంలోనే హంద్రీనీవా నీటిని తీసుకువస్తామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. చిత్తూరు జిల్లా కుప్పంలో ఈ రోజు పలు అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. నూతనంగా మంజూరైన 3,041 పింఛన్లను లబ్ధిదారులకు అందజేశారు. అనంతరం జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ... దేశంలోనే ఆదర్శ నియోజకవర్గంగా కుప్పాన్ని తయారు చేస్తామన్నారు. 3,890 కోట్ల రూపాయల వ్యయంతో హంద్రీనీవా పనులు పూర్తి చేస్తున్నామని ముఖ్యమంత్రి పేర్కొంటూ....

(వాయిస్ 34 సెకన్లు)

==========================

కర్నూలు- విజయవాడ మధ్య ఇండిగో విమాన సేవలను పౌరవిమానయాన శాఖ మంత్రి కె. రామ్మోహన్ నాయుడు ఈ రోజు ఢిల్లీ నుంచి దృశ్య మాధ్యమం ద్వారా ప్రారంభించారు. వారానికి మూడు రోజుల పాటు కర్నూలు- విజయవాడ మధ్య సర్వీసులను ఇండిగో సంస్థ నడపనుంది. త్వరలో ప్రతిరోజూ ఉండేలా చర్యలు తీసుకుంటామని కేంద్రమంత్రి ఈ సందర్భంగా తెలిపారు. అదే విధంగా కర్నూలు నుంచి మిగిలిన ప్రాంతాలకు కూడా సర్వీసులు నడిపేలా చూస్తామన్నారు. విమాన సర్వీసుల ప్రారంభం సందర్భంగా కర్నూలులో రాష్ట్ర భారీ పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ తదితరులు ప్రయాణికులకు స్వాగతం పలికారు.

===========================

రాష్ట్రంలో మహిళల కోసం ఆగస్టు 15 నుండి ఉచిత బస్సు ప్రయాణం కార్యక్రమాన్ని అమలు చేయనున్నామని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. పాలకొల్లు నియోజకవర్గం తిల్లపూడిలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఈ రోజు పాత్రికేయులతో ఆయన మాట్లాడుతూ... రైతులకు అన్నదాత సుఖీభవ పథకం ద్వారా 20 వేల రూపాయలను పంపిణీ చేయనున్నామని చెప్పారు. పేదరికం లేని సమాజం కోసం పి-4ను అమలు చేసేందుకు ప్రణాళికను రూపొందించామని మంత్రి వెల్లడిస్తూ...

(వాయిస్ 33 సెకన్లు)

===========================

డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం క్రియాశీలకంగా వ్యవహరించాలని వైద్యారోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ కోరారు. విజయవాడలోని విశ్వవిద్యాలయ సమావేశ మందిరంలో ఈ రోజు విశ్వవిద్యాలయ పనితీరుపైన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... నాణ్యమైన వైద్య విద్య ప్రమాణాల కోసం కళాశాలలపై నిఘా పెట్టాలని ఆదేశించారు. లక్ష్యం లేకుండా సాగుతున్న పరిశోధన కార్యక్రమాలను గాడిన పెట్టాలని సూచించారు. విశ్వవిద్యాలయంలో చేపట్టాల్సిన సంస్కరణల కోసం కమిటీని వేస్తామని మంత్రి ప్రకటించారు. విశ్వవిద్యాలయం వైద్య విద్య వికాసానికి కృషి చేయాలని ఆయన కోరారు.

===========================

విశాఖపట్నం, విజయనగరం జిల్లాల పరిధిలో చేపట్టనున్న మై ఫెయిర్స్, ఒబెరాయ్ హోటళ్ల నిర్మాణ ప్రాజెక్టులకు సంబంధించిన భూ సేకరణ ప్రక్రియపై రెండు జిల్లాల అధికారులతో ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్ ఈ రోజు సమీక్షా సమావేశం నిర్వహించారు. విశాఖపట్నం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ఈ సమీక్షా సమావేశంలో మై ఫెయిర్స్, ఒబెరాయ్ హోటళ్ల ప్రతినిధులు, జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్, వి.ఎం.ఆర్.డి.ఎ. కమిషనర్ కె ఎస్ విశ్వనాథన్, జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్, విజయనగరం జిల్లా సంయుక్త కలెక్టర్ ఎస్.సేతుమాధవన్ తదితర అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విశాఖపట్నం జిల్లాలో చేపట్టనున్న పర్యాటక ప్రాజెక్టులకు సంబంధించి భూసేకరణ, క్రమబద్ధీకరణ, ఇతర సాంకేతిక ప్రక్రియలపై అజయ్ జైన్ సమీక్షించారు.

విరామం

===========================

ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు అనేక సంస్కరణలు తీసుకువచ్చామని రాష్ట్ర ఐటీ, విద్యా శాఖల మంత్రి నారా లోకేష్ తెలిపారు. కర్నూలు జిల్లా పత్తికొండ మండలం గిరిజన గ్రామమైన జేఎం తండాలోని ప్రభుత్వ ఏకోపాధ్యాయ ప్రాథమిక పాఠశాలలో అంకితభావంతో పనిచేస్తున్న ఉపాధ్యాయురాలు ఎం.కల్యాణి కుమారిని మంత్రి 'షైనింగ్ టీచర్' పేరుతో ఈ రోజు సత్కరించారు. ఆమెను కుటుంబంతో సహా గుంటూరు జిల్లా ఉండవల్లిలోని మంత్రి నివాసానికి పిలిపించుకుని ఆమె చేస్తున్న సేవలను ప్రత్యేకంగా ప్రశంసించారు.

===========================

అర్హులైన ప్రతి లబ్ధిదారునికి ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందిస్తున్నామని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ అన్నారు. అనంతపురం జిల్లా ఉరవకొండ నియోజకవర్గంలోని కూడేరు మండలం జయపురం గ్రామంలో ఈ రోజు జరిగిన "సుపరిపాలనలో తొలి అడుగు" కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... గత సంవత్సర కాలంలో రాష్ట్రంలో అభివృద్ధి కార్యక్రమాలు పెద్ద ఎత్తున జరిగాయని చెప్పారు. ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి పేర్కొంటూ...

(వాయిస్ 23 సెకన్లు)

==========================

ఉమ్మడి పశ్చిమ గోదావరి జిలాల్లోని అన్ని న్యాయస్థానాల్లో ఈనెల 5వ తేదీన జాతీయ లోక్ అదాలత్ ను నిర్వహిస్తున్నామని జిల్లా న్యాయమూర్తి ఎస్.శ్రీదేవి తెలిపారు. ఏలూరు కోర్టు ఆవరణలో ఈ రోజు పాత్రికేయులతో ఆమె మాట్లాడుతూ.... రాజీ అయ్యే కేసులను లోక్ అదాలత్ ద్వారా త్వరితగతిన పరిష్కారం చేసుకోవాలని సూచించారు.

==========================

పార్వతీపురం మన్యం జిల్లా గుమ్మలక్ష్మీపురంలో రాయితీపై పశువుల దాణా పంపిణీ కార్యక్రమాన్ని కురుపాం శాసన సభ్యురాలు తోయక జగదీశ్వరి ఈ రోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పశువుల ఆరోగ్యం, ఉత్పత్తులు కాపాడడానికి పాడి రైతులకు సబ్సిడీపై నాణ్యమైన దాణా సరఫరా చేస్తున్నామని పేర్కొన్నారు. పాడి రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని పాడి అభివృద్ధికి కృషి చేస్తూ ఆర్థికంగా బలోపేతం కావాలని సూచించారు.

==========================

శ్రీ సత్య సాయి జిల్లాలో పచ్చదనాన్ని పెంపొందించడానికి ఐదు నగర వనాలను అభివృద్ధి చేస్తున్నామని జిల్లా అటవీ శాఖ అధికారి చక్రపాణి తెలిపారు. బుక్కపట్నంలోని DFO కార్యాలయంలో ఆయన ఈ రోజు పాత్రికేయులతో మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వం ఒక్కో నగర వనానికి 2 కోట్ల రూపాయలు కేటాయిస్తోందన్నారు. నగర వాసులకు ఆహ్లాదాన్ని పంచేందుకు మున్సిపాలిటీలకు 10 కిలోమీటర్ల దూరంలో అటవీ ప్రాంతంలో ఈ నగరవనాలను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు.

==========================

పీజీ డిప్లొమో ఇన్ గాంధీయన్ సోషల్ వర్క్ కోర్సులలో ఈ విద్యాసంవత్సరంలో ప్రవేశానికి అర్హులైన అభ్యర్థుల నుండి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని శ్రీకాకుళంలోని డాక్టర్ బీ.ఆర్.అంబేద్కర్ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఆచార్య పి.సుజాత తెలిపారు. రెండు సెమిస్టర్లుగా నిర్వహించనున్న ఈ కోర్సుకు సంబంధించిన తరగతులు ఈ నెల 21వ తేదీ నుంచి ప్రారంభమవుతాయని తెలిపారు. 30 సీట్లు గల ఈ కోర్సులో ప్రవేశం పొందేందుకు ఏదైనా డిగ్రీ పూర్తి చేసి ఉండాలని ఆమె పేర్కొన్నారు.

==========================

ఉపరితల ఆవర్తనం ప్రభావంతో ఉత్తర కోస్తా జిల్లాలతో పాటు రాష్ట్రంలోని పలు జిల్లాలలో రానున్న 3 రోజులు తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు కురుస్తాయని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. ఆ వివరాలను వాతావరణ శాఖ అధికారి వెల్లడిస్తూ...

(వాయిస్ 31 సెకన్లు)

==========================
==========================